నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, శనివారం 19 అక్టోబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM

నాకు పరిహారం అందలేదు..

పెదవాగు ఇసుక మేటలు వేయడంతో నాకున్న రెండెకరాల్లో పంటను నష్టపోయాను. పరిహారం చెల్లింపులో అధికారులు కనీసం మా భూమిని గుర్తించలేదు. కానీ.. భూమిలేని రైతులకు పరిహారం చెల్లించారు. ఒకే ఇంటి పేరుతో ఉన్న 15 మందికి పైగా పరిహారం చెల్లించారు. వారిలో ఎవరికీ సెంటు భూమి కూడా లేదు. అనర్హులకు పరిహారం అందించడంపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి.
–వంటిపల్లి రాము, బాధిత రైతు, గుమ్మడవల్లి

పొలం లేనోళ్లకు పరిహారమందింది

పెదవాగు వరదలకు మా పొలంలో ఇసుక మేటలు వేశాయి. కట్టకు అతి సమీపంలోనే మా పొలం ఉంది. అధికారులు సర్వే చేసినప్పటికీ పరిహారం మంజూరు కాలేదు. కానీ పొలం లేని వారికి పరిహారం చెల్లించారు. మా పొలంలో ఇసుక మేటలు వేసినా నష్ట పరిహారం రాలేదంటూ అధికారులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకపోయింది. మొదటి విడత పరిహారం చెల్లింపులోనే అక్రమాలు జరిగాయి. రెండో విడతలోనూ అలాగే జరిగింది.
–నాగమణి, మహిళా రైతు, గుమ్మడవల్లి

రికవరీ చేయకుంటే ఆందోళన

అనర్హులకు చెల్లించిన వరద పరిహారం నిధులను రికవరీ చేయాల్సిందేనని బాధిత రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. నిజంగా పంట నష్టపోయిన రైతులకు అందించాల్సిన పరిహారాన్ని భూమి లేని వారికి, ఇతర ప్రాంతాల వారికి ఎలా చెల్లిస్తారంటూ మండిపడుతున్నారు. రాజకీయ సిఫార్సులతో అధికారులు రైతుల సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారంటూ ఆరోపిస్తున్నారు. అనర్హులకిచ్చిన నిధులను రికవరీ చేయకుంటే ప్రత్యేక్ష ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు. 'అసలైన రైతులం కన్పించడం లేదా?' అంటూ ప్రశ్నిస్తున్నారు.

గుమ్మడవల్లికి చెందిన రైతు దేరంగుల సురేశ్ పొలంలో వేసి ఇసుక మేట

మలి విడతలోనూ శరగోపం

- 'పెదవాగు పరిహారం'లో అర్హులకు మళ్లీ మొండి'చేయి'
- రెండో విడతలోనూ మరోసారి అనర్హులకే మంజూరు
- ఇటీవలి దుర్వినియోగంపైనా విచారణకు వెనుకడుగు

పంట నష్టపరిహారం చెల్లింపులో దుర్వినియోగమైన నిధులపై కనీసం విచారణ జరపని కాంగ్రెస్ సర్కార్.. తాజాగా రెండో విడత నిధులనూ విడుదల చేసింది. అర్హులైన బాధిత రైతులకు మరోసారి మొండి చేయి చూపించింది. అనర్హులకు పరిహారం చెల్లించింది. మొదటి విడతలో అనర్హులకు పరిహారం అందించిన అంశంపై 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైనా సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు మిన్నకుండిపోయారు. విచారణ జరపలేదు. అక్రమాలపై కొరడా ఝుళిపించలేదు. పైగా మరో విడతలోనూ అదే ధోరణిలో అనర్హులకు పరిహారం అందించారు. దీంతో రెండో విడతలోనూ తమకు పరిహారం అందకపోవడంతో అర్హులైన బాధిత రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అశ్వారావుపేట, అక్టోబర్ 18: అశ్వారావుపేట మండలంలోని పెదవాగు ప్రాజెక్టు కట్ట గత జూలైలో కురిసిన అధిక వర్షాలకు కొట్టుకుపోయింది. ఆయకట్టు రైతులను తీవ్రంగా నష్టపరిచింది. వరదలకు ఆయకట్టు పొలాలపై ఇసుక మేటలు వేయడంతో రైతులు ఆర్థికంగా దెబ్బతిన్నారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం పరిహారం అందించేందుకు నిర్ణయించింది. నష్టపోయిన రైతుల వివరాలు సేకరించాలని వ్యవసాయాధికారులను ఆదేశించింది. అయితే, వరద బాధిత రైతులను గుర్తించడంలో అధికారులు అక్రమాలకు పాల్పడ్డారు. కనీసం భూమి కూడా లేని రైతులను, ఇతర రాష్ట్రాల రైతుల్లోని రైతులను ఎంపిక చేసి పరిహారం మంజూరు చేశారు. అసలైన బాధిత రైతులను విస్మరించారు. ఒకే కుటుంబంలో 15 మందికి అసలు భూమి లేకున్నా అధికారులు పరిహారం చెల్లించడం గమనార్హం. ఇదే పరిస్థితి గుమ్మడవల్లి పంచాయతీలోనే ఎక్కువగా జరిగింది. పంట నష్టపోయిన బాధిత రైతుల గోడును అధికారులు పట్టించుకోలేదు. ఈ విషయంపై కొందరు రైతులు 'నమస్తే తెలంగాణ'కు సమాచారం అందించడంతో సెప్టెంబర్ 8న 'అర్హులకు మొండిచేయి' శీర్షికన కథనాన్ని ప్రచురించింది. పరిహారం పక్కదారి పట్టిన విషయం వెనుక రాజకీయ సిఫార్సులు ఉన్నట్లు ఆరోపణలొచ్చాయి. 'నమస్తే' కథనంపై కలెక్టర్ స్పందించి.. అర్హులైన రైతుల జాబితా పంపించాలని ఆదేశించారు. అయినా అర్హులను గుర్తించలేదు.

అధిక వర్షాలకు దెబ్బతిన్న పెదవాగు ప్రాజెక్టు (ఫైల్)

రెండో విడత పరిహారం చెల్లింపు..

పెదవాగు బాధిత రైతులకు జీవో 2 ప్రకారం పరిహారం చెల్లింపునకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. అప్పటికే అధికారులు ఎక్కువ మంది అనర్హులను ఎంపిక చేసి వారికి పరిహారం అందించారు. ఆ పరిహారం సొమ్ము సరిపోవడం లేదంటూ రెండో విడత మరికొన్ని నిధులను ప్రభుత్వం కేటాయించింది. మొదటి విడతలో బచ్చువారిగూడెం, గుమ్మడవల్లి, ఖమ్మంపాడు, నారాయణపురం గ్రామాలకు చెందిన 303 మంది రైతులకు చెందిన 391.19 ఎకరాలకు పరిహారం కింద రూ.40,71,339 చెల్లించింది. ఇందులో ఇసుక మేటలు తొలిగించుకోవడానికి రూ.19,32,712, నష్ట పరిహారం కింద రూ.21,38,627 చొప్పున నిధులు మంజూరు చేసింది. వీటి చెల్లింపులో అధికారులు చేతివాటం ప్రదర్శించారు. అర్హులైన రైతులను పక్కకు నెట్టి రాజకీయ సిఫార్సులతో భూమి లేని వారికి, పొరుగు రాష్ట్రంలో ఉండే వారికి పరిహారం చెల్లించారు. తాజాగా రెండో విడతలో వీరికే మరో రూ.14,73,407 నిధులను విడుదల చేసింది.

జాబితా ప్రకారమే పరిహారం..

వ్యవసాయ శాఖ అధికారులు ఇచ్చిన జాబితా ప్రకారం ప్రభుత్వం మంజూరు చేసిన పరిహారాన్నే చెల్లిస్తాం. అర్హులైన రైతుల జాబితా ఎంపికలో మా ప్రమేయం ఏమీ ఉండదు.
–కృష్ణప్రసాద్, తహసీల్దార్, అశ్వారావుపేట

ఉన్నతాధికారుల సూచనలతో తదుపరి చర్యలు..

నేను బాధ్యతలు నిర్వహించిన సమయంలో బాధిత రైతుల ఎంపిక జరగలేదు. పెదవాగు బాధిత రైతుల పరిహారం విషయంలో ఏవైనా ఫిర్యాదులు అందితే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వారి సూచనలతో తదుపరి చర్యలు తీసుకుంటాం.
–శివ రాంప్రసాద్, ఏవో, అశ్వారావుపేట

నేడు బీఆర్ఎస్ జిల్లాస్థాయి సమావేశం

పార్టీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

మణుగూరు టౌన్, అక్టోబర్ 18: కొత్తగూడెంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం (తెలంగాణ భవన్)లో పార్టీ జిల్లాస్థాయి సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పార్టీ మాజీ ఎమ్మెల్యేలు సమావేశానికి ముఖ్యఅతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ జెడ్పీటీసీలు, రైతు సమన్వయ కమిటీ అధ్యక్షులు, సహకార సంఘాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాలి

- అన్నిక్రీడాంశాల్లోనూ రాణించాలి: భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్
- కిన్నెరసాని స్పోర్ట్స్ పాఠశాలలో జోనల్‌స్థాయి క్రీడలు ప్రారంభం

కిన్నెరసారి స్పోర్ట్స్ స్కూల్లో ఆర్చరీ పోటీలను ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

పోటీల్లో భాగంగా కబడ్డీ ఆడుతున్న బాలికలు

పాల్వంచ రూరల్, అక్టోబర్ 18: గిరిజన బాలబాలికలు వివిధ క్రీడాంశాల్లో రాణిస్తూ అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాలని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ ఆకాంక్షించారు. ఐటీడీఏ స్థాయిలో నిర్వహించే జోనల్ స్థాయి క్రీడలను కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్లో శుక్రవారం ఆయన ప్రారంభించారు. తొలుత క్రీడా జ్యోతిని వెలిగించారు. అనంతరం బెలూన్లు గాలిలో ఎగురవేసి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరదారుఢ్యానికి, మానసికోల్లాసానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించినప్పుడు మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రతి పాఠశాలకు అవసరమైన క్రీడా పరికరాలు, సామగ్రిని అందిస్తామని, గిరిజన బాలబాలికల్లో సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు ప్రతి ఆదివారం ఒక వినూత్న కార్యక్రమం చేపడతామని వెల్లడించారు. నైపుణ్యం కలిగిన క్రీడాకారులను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపించాలని వ్యాయామ ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, రమణయ్య, ఏటీడీవోలు జహీరుద్దీన్, అశోక్‌కుమార్, రాధమ్మ, చంద్రమోహన్, స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాలరావు, పీడీలు, పీఈటీలు, కోచ్‌లు పాల్గొన్నారు.

ప్రవేశాలు పూర్తి చేయండి

మణుగూరు పర్యటనలో ఉపాధి, శిక్షణ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్‌వీకే నగేశ్

అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ నగేశ్

మణుగూరు టౌన్, అక్టోబర్ 18: అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)లో ప్రవేశాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఉపాధి, శిక్షణ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్‌వీకే నగేశ్ ఆదేశించారు. మణుగూరు ప్రభుత్వ ఐటీఐని శుక్రవారం సందర్శించిన ఆయన ఏటీసీ ప్రవేశాలపై సమీక్షించారు. ఏటీసీలోని ఆరు కోర్సుల్లో ఇప్పటివరకు జరిగిన అడ్మిషన్ల వివరాలను తెలుసుకున్నారు. మిగిలిన వాటిని కూడా సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఏటీసీ నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన వేగవంతంగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆయన వెంట ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రభాకర్, టీవో రవి, సూపరింటెండెంట్ జ్యోతిరాణి, సీనియర్ అసిస్టెంట్ సయ్యద్ ఇఫ్తార్, ఏటీవోలు శ్రీనివాసరావు, కృష్ణారావు ఉన్నారు.

ఆదాయమిచ్చే పంట 'మునగ'

- సాగుపై జిల్లా రైతులకు అవగాహన కల్పించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో భద్రాద్రి కలెక్టర్ జితేశ్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్ పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): అధిక ఆదాయాన్నిచ్చే మునగ సాగుపై రైతులు దృష్టి సారించాలని, ఆ దిశగా వారికి అవగాహన కల్పించాలని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ వ్యవసాయాధికారులకు సూచించారు. మొరింగ ప్లాంటేషన్, అజోల్ల పెంపకం, కెనాల్ బండ్ ప్లాంటేషన్, చేపలు, పుట్టగొడుగుల పెంపకంపై అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందనతో కలిసి ఐడీవోసీ నుంచి జిల్లాలోని నర్సరీల యజమానులు, వ్యవసాయ అకారులతో శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని రైతులు వేసవిలో వ్యవసాయ భూములు ఖాళీగా ఉంచకుండా మునగ సాగు చేయాలని, దీని ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని అన్నారు. మునగ ఆకు పొడికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. మొదటి విడతలో జనవరి నెలలో పది వేల ఎకరాల్లో రైతులు మునగ సాగు చేపట్టే విధంగా అవగాహన సదస్సులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇరిగేషన్ శాఖ పరిధిలో చాలా ఎకరాలు ఖాళీగా ఉన్నాయని, వాటిలో వెదురు మొక్కలు నాటాలని ఆదేశించారు. సాగునీటి కాల్వలకు ఇరువైపులా జామాయిల్, వెదురు, సుబాబుల్ మొక్కలు నాటాలన్నారు. అలాగే పుట్టగొడుగులు, చేపల పెంపకం ఎక్కువగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అజోల్ల సాగు నీటి లభ్యతపై ఆధారపడి ఉంటుందని, రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటి లభ్యత ఆధారంగా సాగు చేయాలని సూచించారు. డీపీవో చంద్రమౌళి, అదనపు డీఆర్డీవో రవి, డీఏవో బాబూరావు, జిల్లా ఇండస్ట్రియల్ మేనేజర్ పృథ్వీ, స్త్రీనిధి ఆర్ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

యూనిఫాం లేకుంటే..

మెమోలు జారీచేస్తాం

పీహెచ్‌సీ తనిఖీలో డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్‌నాయక్

పీహెచ్‌సీని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 18: పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలలో విధులు నిర్వర్తించే సిబ్బంది తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్‌నాయక్ సూచించారు. లేదంటే మెమోలు జారీ చేయాలని స్పష్టం చేశారు. సుజాతనగర్ పీహెచ్‌సీని శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఐపీ, ఓపీ రోగులను పలుకరించారు. సిబ్బంది పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, వారి పట్ల మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. డాక్టర్ రమేశ్, డాక్టర్ పూజ, సిబ్బంది పాల్గొన్నారు.

'ఏటీసీ'లో చేరికలకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, అక్టోబర్ 18: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలో పదో తరగతి పాసైన గిరిజన అభ్యర్థుల నుంచి ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించే అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ ఒక ప్రకటనలో తెలిపారు. మణుగూరు మండలం ముత్యాలమ్మనగర్ ఐటీఐలో 2024-25 విద్యాసంవత్సరానికి మ్యాన్‌ఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్ కోర్సుకు పదో తరగతి పాసై ఉండాలని, ఏడాది కోర్సుకు 40 సీట్లు ఉంటాయని తెలిపారు. ఇండస్ట్రియల్ రోబోటిక్స్, డిజిటల్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ టెక్నీషియన్ కోర్సుకు 10వ తరగతి పాసై ఉండాలని, ఇందులో 40 సీట్లు ఉంటాయని పేర్కొన్నారు. ఆర్టిజన్ యూజిగ్ అడ్వాన్స్ టూల్స్‌కు 20 సీట్లు, బేసిక్ డిజైనర్, వర్చువల్ వెరిఫైర్(మెకానికల్)కు ఏడాది కాలపరిమితికి 24 సీట్లు, అడ్వాన్స్ సీఎన్‌సీ మిషన్ టెక్నీషియన్ కోర్సుకు రెండేళ్ల కాలపరిమితితో 24 సీట్లు, మెకానిక్ ఎల్లక్ట్రికల్ వెహికల్ కోర్సు రెండేళ్ల కాలపరిమితికి 24 సీట్లు ఉంటాయని పీవో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 30వ తేదీలోగా http://iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ చేసుకుని ఒరిజినల్ సర్టిఫికెట్లతో మణుగూరు ఐటీఐలో హాజరు కావాలని, పూర్తి వివరాలకు 9440206990, 9989637594 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మెరికల్లా తీర్చిదిద్దేది టీచర్లే..

- ప్రభుత్వ పాఠశాలలు దేవాలయాలతో సమానం
- విద్యార్థులకు చదువుపై కసి పెంచే బాధ్యత ఉపాధ్యాయులదే..
- ఖమ్మం జిల్లాలో విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి
- డీఎస్సీ టీచర్లతో ముఖాముఖిలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్18: చదువుల్లో ప్రతి విద్యార్థిపై దృష్టి సారించి.. వారిని మెరికల్లా తీర్చిదిద్దేది ఒక్క ఉపాధ్యాయుడేనని, వారు విధులు సమర్థవంతంగా నిర్వర్తించినప్పుడే మరింత మంది విద్యార్థులు ప్రయోజకులవుతారని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో డీఎస్సీ-2024 ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులతో శుక్రవారం ఏర్పాటు చేసిన ముఖాముఖిలో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు దేవాలయాలతో సమానమని, మన తల్లిదండ్రులు కూడా అవే పాఠశాలల్లో చదివి గొప్ప స్థాయికి ఎదిగారని గుర్తు చేశారు. డీఎస్సీ కోసం ఎంతో కష్టపడి చదివి ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించారని, ఇది మీకు మొదటి అడుగు మాత్రమేనన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో బడుగు, బలహీన వర్గాల పిల్లలు ఎక్కువగా చదువుతారని, వీరిలో కసి పెంచి జీవితంలో ఉన్నత స్థాయికి చేరేలా చూడాలన్నారు. అమెరికా, కెనడా వంటి దేశాలు సైతం వైఫల్యం పొందిన చంద్రయాన్ ప్రాజెక్టులను ఇస్రో శాస్త్రవేత్తలు విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టారని, వారంతా ఎక్కువగా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివారన్నారు. విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతంపై దృష్టి పెట్టామన్నారు. నా చిన్నతనంలో 7వ తరగతి వరకు బ్యాక్ బెంచ్ స్టూడెంట్‌గా ఉన్నానని, అప్పుడు విజయలక్ష్మి టీచర్ పెట్టిన శ్రద్ధతో నేడు కలెక్టర్‌గా ఉన్నానని తెలిపారు. జెడ్పీ సీఈవో దీక్షా రైనా మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తి చాలా ఉన్నతమైనదని, వారి కారణంగానే మనమంతా ఈ స్థాయిలో ఉన్నామని గుర్తు చేశారు. డీఈవో సోమశేఖర శర్మ మాట్లాడుతూ ప్రభుత్వం జిల్లాలో 516 మందిని డీఎస్సీ-2024 ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపిక చేసిందని, ఇందులో 481 మంది విధుల్లో చేరారన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు, ఆర్ఎంవో రాజశేఖర్, ఏఎంవో రవి, హెచ్ఎంలు, అధికారులు పాల్గొన్నారు.

కార్యక్రమానికి హాజరైన డీఎస్సీలో ఎంపికైన నూతన టీచర్లు

ఖమ్మం నగరంలోని జిల్లా గ్రంథాలయం ఎదుట ధర్నా చేస్తున్న గ్రూప్-1 అభ్యర్థులు

గ్రూప్-1 పరీక్ష రద్దు చేయాలి

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల గ్రంథాలయాల ఎదుట అభ్యర్థుల ఆందోళన

రఘునాథపాలెం/ కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 18: గ్రూప్-1 పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పలువురు అభ్యర్థులు ఖమ్మంలోని జిల్లా గ్రంథాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం మెయిన్స్ పరీక్షల్లో ఉన్న లోపాలను సవరించడంతోపాటు మెయిన్స్ పరీక్షను వాయిదా వేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు అభ్యర్థులు మాట్లాడుతూ హైదరాబాద్ అశోక్‌నగర్‌లో మూడు రోజులుగా గ్రూప్-1 మెయిన్స్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్న అభ్యర్థులపై కాంగ్రెస్ ప్రభుత్వం లాఠీచార్జి చేయడం సరికాదన్నారు. జీవో నంబర్ 29ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, అభ్యర్థులకు న్యాయం జరిగే విధంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను పాటించాలని డిమాండ్ చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు అభ్యర్థులు పాల్గొన్నారు.

భద్రాద్రిలో ప్లకార్డులతో నిరసన

రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 29ని వెంటనే రద్దు చేయాలని, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను కచ్చితంగా పాటించాలని డిమాండ్ చేస్తూ సేవాలాల్ సేన జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పలువురు అభ్యర్థులు భద్రాద్రి జిల్లా గ్రంథాలయం ఎదుట శుక్రవారం ప్ల కార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేశ్‌నాయక్ మాట్లాడుతూ జీవో నంబర్ 29 అమలు చేయడం వల్ల గ్రూప్-1 రాసే ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ద్వారానే వారికి న్యాయం జరుగుతుందని, వెంటనే జీవో నంబర్ 29ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీనునాయక్, లావుడ్యా వెంకటేశ్‌నాయక్, బానోత్ నాగరాజు, బానోత్ లక్ష్మణ్, వపన్, రమేశ్, దేవేందర్, సురేశ్, బాలు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంలో నిరసన తెలుపుతున్న సేవాలాల్ సేన నాయకులు

పోలీసు శాఖపై..

విశ్వసనీయత పెంచాలి

- మాదక ద్రవ్యాలు, ఇసుక రవాణాపై ఉక్కుపాదం మోపాలి
- టేకులపల్లి ఠాణాను సందర్శించిన భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు

టేకులపల్లి, అక్టోబర్ 18 : ప్రజలకు పోలీసు శాఖపై విశ్వసనీయత పెంచాలని, అందుకోసం ప్రతి ఒక్కరూ తమ విధులు, బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. మాదక ద్రవ్యాలు, ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని, ఇందులో పట్టుబడితే ఎంతటివారైనా వదిలిపెట్టకూడదని ఆదేశించారు. టేకులపల్లి పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం సందర్శించిన ఎస్పీ.. తొలుత ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. ఇసుక, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై ఆరా తీశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ అధికారులు, సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలన్నారు. తర్వాత ఠాణాలో వాహనాల కోసం ఏర్పాటు చేసిన షెడ్డును, టేకులపల్లి బోడ్ రోడ్డు సెంటర్, ముత్యాలంపాడు క్రాస్ రోడ్‌లో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలను పోలీస్‌స్టేషన్ నుంచి పరిశీలించారు. ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను, టేకులపల్లి సీఐ టి.సురేశ్, ఎస్సై పి.సురేశ్, బోడు ఎస్సై శ్రీకాంత్, ఏఎస్సై వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ నర్సింహారావు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఠాణా ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎస్పీ